క్లుప్తంగా

సేవారత్న అవార్డు అందజేత


సేవా రత్న అవార్డు అందుకుంటున్న అనూష

రాయదుర్గంటౌన్: బెంగళూరులోని సోమలరాజు ఫౌండేషన్ రాయదుర్గం పట్టణానికి చెందిన శ్రీరామ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు అనూషకు భారత సేవా రత్న అవార్డు అందజేశారు. శనివారం బెంగళూరులో జరిగిన సోమలరాజు ఫౌండేషన్ వార్షికోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు అనూషను సేవా రత్న అవార్డుతో సత్కరించారు. అవార్డులతో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రెట్టింపు ఉత్సాహం లభిస్తుందని అనూష సంతోషం వ్యక్తం చేశారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షులుగా సుదీప్, అభిషేక్, రాజు, భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా దినకర్, సహాయ కార్యదర్శులుగా చిరంజీవి, మాధవ్, మధు, బసవరాజుతోపాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో కళ్యాణదుర్గంలో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. విద్యా ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

రాయదుర్గంటౌన్: విజయవాడలోని వరద బాధితులను కేంద్రం ఆదుకోవాలని సీపీఐ రాయదుర్గం ఇన్‌చార్జ్ నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో సీపీఐ నాయకులు మాట్లాడారు. రెండు వారాలు గడిచిపోయినా వరద విపత్తుపై కేంద్రం స్పందించకపోవడం, ఆర్థికసాయం ప్రకటించకపోవడం, ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. అలాగే వరద బాధితులకు అండగా నిలవడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, తిప్పేస్వామి, దుర్గన్న, అంజి, సుదీప్, గణేస్, కొట్రేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు మదర్‌థెరిస్సా అవార్డు


అవార్డు అందుకుంటున్న తిమ్మారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని రఘువీరా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కంబాల తిమ్మారెడ్డి మదర్ థెరిస్సా అవార్డు అందుకున్నారు. తిమ్మారెడ్డి సామాజిక సేవలను గుర్తించి శనివారం బెంగళూరులోని అంబేడ్కర్ సముదాయం భవన్‌లో సోమలరాజు ఫౌండేషన్ నిర్వాహకులు మదర్ థెరిస్సా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సోమలరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు, మనం ఫౌండేషన్ అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆర్డీటీ తోడ్పాటు


మాట్లాడుతున్న సర్పంచ్ బాపూజీ

కంబదూరు: విద్యాభివృద్ధికి ఆర్డీటీ సంస్థ అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తోందని రష్యాకు చెందిన మార్కస్‌ఫిషర్ అన్నారు. మర్రిమాకుల పల్లిలో రూ.13 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్డీటీ పాఠశాలను శనివారం స్థానిక సర్పంచ్ బాపూజీతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాజు, సీఓ పుల్లమ్మ, కమిటీ సభ్యులు డీ.మారెప్ప, రవీంద్ర, బొమ్మశంకర, మల్లికార్జున, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ ఈశ్వరయ్య



గుమ్మఘట్ట: మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఈశ్వరయ్య బాధ్యతలు చేపట్టారు. అనంతపురం రూరల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు నెల క్రితం అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన సంగతి విదితమే. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు సరిహద్దు గ్రామాల్లో మద్యం, ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే మెడిసిన్ సీటు లభించక పేద పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫ్రీ సీటు వస్తే పేదలు సైతం మెడిసిన్ చేసి ప్రజలకు సేవలందిస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే యాజమాన్యం సీట్లను అమ్ముకుంటుంది... లక్షలు వెచ్చించి ఎంబీబీఎస్ చేయడం పేదలకు అందని ద్రాక్షే అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– కొట్రేష్, ఏఐవైఎఫ్ నాయకుడు, కణేకల్లు



పేద విద్యార్థులకు శాపం



వైద్య విద్య ప్రైవేటీకరణ పేదలకు శాపంగా మారనుంది. పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో వైద్యవిద్య చదవకుండా ప్రభుత్వం పూనుకోవడం దౌర్భాగ్యం. 2024–25లో నూతన మెడికల్ కళాశాలు నడపలేమని ఎన్ఎంసీకు ప్రభుత్వం లేఖ రాయడం సమంజసం కాదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఐదు మెడికల్ కళాశాల్లో 700 సీట్లు భర్తీ చేయాలి. అలాగే మరో ఏడు మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలిపివేయడం దారుణం.

– బంగి శివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, రాయదుర్గం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్

- దాడులతో పేట్రేగుతున్న టీడీపీ మూకలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ మూకలు పెట్రేగుతున్నాయి. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. వ్యవసాయం చేసుకుని జీవించే పచ్చని జీవితాల్లో రాజకీయంగా ఏకపక్ష దాడులు చేస్తూ కూటమి నేతలు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. టీడీపీ నాయకుల తీరుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దాడుల విషయంలో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దాడులు నిత్యకృత్యం

నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారింది. రోజూ ఏదో ఒక గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. పథకం ప్రకారం ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి పనిచేసిన కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ గాయపర్చుతున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్పటి వరకు సుమారు 20కి పైగా దాడుల ఘటనలు జరిగాయి. ఇందులో సగానికి సగం మాత్రమే కేసులు కట్టి మమ అనిపించారు. గతంలో ఎన్నడూ లేని విష సంస్కృతికి టీడీపీ ఆజ్యం పోస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు.

టీడీపీ దాడులలో మచ్చుకు కొన్ని ఘటనలు

- జూలైలో కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన హెచ్.నరసింహులుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఎన్నికల సమయంలో నరసింహులు వైఎస్సార్‌సీపీకి పని చేశారన్న ఒకే ఒక్క కారణంతో ఎన్నికల ఫలితాల అనంతరం దాడికి దిగారు. తీవ్ర గాయాలతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందారు.
- ఈనెల 10న బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్రప్పపై టీడీపీ నాయకులు దాడికి దిగారు. రాత్రి సమయంలో నాగేంద్రప్ప పొలానికి ఆనుకుని ఉన్న కంపచెట్లను టీడీపీ నాయకులు జేసీబీలతో తొలగించేందుకు సిద్ధమయ్యారు. పైపులైన్‌లు ఉన్నాయని ఉదయం పని చేసుకోవాలని టీడీపీ నేతలకు నాగేంద్రప్ప సూచించారు. దీన్ని సహించలేని టీడీపీ నాయకులు మూకుమ్మడిగా నాగేంద్రప్పపై మాకే అడ్డు చెబుతావా అంటూ చితకబాదారు. దాడిలో తీవ్రంగా గాయపడిన నాగేంద్రప్పను కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.
- ఈనెల 13న రాత్రి కుందుర్పి మండలం తూముకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీష్, అతని కుటుంబ సభ్యులపై గ్రామంలో పైప్‌లైన్ విషయమై టీడీపీ నేత గొడ్డలితో దాడికి తెగబడ్డాడు. తీవ్రగాయాల పాలైన జగదీష్, అతని కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన నాగేంద్రప్ప (ఫైల్)

రెడ్ బుక్ పక్కన పెట్టి... రాజ్యాంగం అమలు చేయండి



కూటమి ప్రభుత్వం రెడ్ బుక్‌ను పక్కన బెట్టి రాజ్యాంగం అమలు చేయాలి. నియోజకవర్గంలో ఏ పని చేసినా అది తమ వరకు ఖచ్చితంగా వచ్చే రోజు దగ్గరలోనే ఉంటుంది. పోలీసులు దాడులపై గట్టిగా పనిచేయాలి. తప్పుచేసిన వారిని శిక్షించాలి. టీడీపీ నాయకులు కూడా అధికారాన్ని ప్రజాసేవకు వినియోగించాలి. కళ్యాణదుర్గంలో దాడుల సంస్కృతి మంచిది కాదు. మరోసారి దాడులు పునరావృతమైతే సహించబోం.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

‘మిలాద్ ఉన్ నబీ’ జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సున్నీ దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే మిలాద్ ఉన్న నబీ వేడుకలను జయప్రదం చేయాలని మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, చమ్మా అస్లాం, అబూబక్కర్ కోరారు. వేడుకల్లో భాగంగా మసీదులో ఆదివారం రాత్రి 9 గంటలకు ఈషా నమాజ్ అనంతరం కర్ణాటకకు చెందిన మౌలానా ముఫ్తి సైఫుల్లాసాబ్‌చే మహమ్మద్ ప్రవక్త జీవితంపై ప్రసంగం ఉంటుందన్నారు. 16వ తేదీ ఉదయం 9 గంటలకు పట్టణంలో మక్కా, మదీనాలను పోలిన నమూనాలతో భారీ ఊరేగింపు చేస్తామన్నారు. ముస్లింలు తరలివచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు సీపీఎం మండల మహాసభ

కూడేరు: మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీపీఎం మండల మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లప్ప, రంగయ్య హాజరవుతారన్నారు. సీపీఎం నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో విధుల నిర్వహణ

ఉరవకొండ: సర్వీస్ కోటాలో పీజీ సీట్లు 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడంతో వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పలు పీహెచ్‌సీల వద్ద వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా ఈనెల 15న విజయవాడలో వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఉరవకొండ: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా బ్రిడ్జి వద్ద వేగంగా వచ్చిన కారు బోల్తా పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉరవకొండ పట్టణానికి చెందిన పవన్ కుమార్, ప్రేమ్ కుమార్, ఖాదర్.. బళ్లారికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉరవకొండకు వస్తుండగా కొట్టాలపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా బ్రిడ్జి వద్ద వేగంగా కారు దూసుకొచ్చి చెట్టును ఢీకొట్టింది. క్షతగాత్రులను దీంతో 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం తరలించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: మద్యానికి డబ్బు ఇవ్వలేదనే కారణంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. శనివారం తన భార్య మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదనే కారణంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక సీహెచ్‌సీకీ తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ఉరవకొండ: ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ కోర్టు ప్రాంగణంలో శనివారం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మొత్తం 82 కేసులు పరిష్కారం కాగా.. ఇందులో బ్యాంకు–41, సివిల్–5, క్రిమినల్–13, మిగిలినవి ఎంసీ, ఎస్టీసీ కేసులు ఉన్నాయి. వీటి ద్వారా రూ.8,47,600 ద్వారా రుసం వచ్చింది. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ.. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక ‘జాతీయ లోక్ అదాలత్’ అని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఎం.రమ్య అన్నారు. శనివారం రాయదుర్గం కోర్టులో జడ్జి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీమార్గంతో 172 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


ఉరవకొండలో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 270 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రతిభ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. కార్యక్రమంలో న్యాయవాదులు దాదాఖలందర్, ముత్యాలప్ప దేవేంద్ర, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

వజ్రకరూరు: నియోజకవర్గంలో రోజు రోజుకు అరాచకాలు పెరిగిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇటీవల కమలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కె.యోగానందకు చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో కాలిపోయిన విషయం తెలిసిందే. శనివారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కమలపాడు గ్రామానికి చేరుకుని కాలిపోయిన ద్విచక్ర వాహనాన్ని పరిశీలించారు. బాధితుడు యోగానందను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కళ్లెదుటే ద్విచక్ర వాహనం కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని బాధితుడు యోగానంద కన్నీటి పర్యంతం అయ్యారు. అధైర్యపడవద్దని.. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని మాజీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మోపిడి సర్పంచ్ ఇంట్లోకి కొందరు దుండగులు చొరబడి చెట్లను కొట్టేశారన్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, తిమ్మారెడ్డి, ముని రెడ్డి, సందీప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కురుబ అల్లెప్ప, ఎరికుల సంఘం రాష్ట్ర నాయకుడు శేఖర్, మండల నాయకులు ఉస్మాన్, నారాయణ, కిష్టప్ప, భీమా, దాసరి గోవిందు, ప్యాపిలి రమేష్, భూమన్న, సంజప్ప, రామకృష్ణ, గోవిందు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

దోమకాటుతో విష జ్వరాల వ్యాప్తి

కూడేరు: విష జ్వరాల వ్యాప్తికి దోమలే కారణం. ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు సూచించారు. మండల పరిధిలోని రామచంద్రాపురంలో చంద్రకళ అనే మహిళ టైఫాయిడ్ జ్వరంతో మృతి చెందింది. శనివారం వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మలేరియా నివారణాధికారి ఓబులు, సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తదితరులు గ్రామంలో పర్యటించారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. వీధుల్లో పర్యటించి మురుగునీరు, అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా అబెట్ మందు పిచికారీ చేయించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు జయమ్మ, కరిష్మా, హెల్త్ అసిస్టెంట్లు రమేష్, మురళి, శివప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


గేదె ప్రాణాలు కాపాడిన పశు వైద్యులు

కూడేరు: ఈనలేక ఇబ్బంది పడుతున్న గేదెకు పశువైద్యులు సిజేరియన్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. శనివారం మండల పరిధిలోని కమ్మూరుకు చెందిన బోయ ఓబులేసు గేదె ఈనలేక ఇబ్బంది పడింది. ఈ విషయాన్ని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఆయన అనంతపురంలోని పశు వైద్యశాలలోని ప్రసూతి పశు వైద్య నిపుణుడు పద్మనాభం (ఏడీ ఏవీహెచ్ శింగనమల) వద్దకు అత్యవసర చికిత్స నిమిత్తం సిబ్బంది ద్వారా గేదెను తీసుకెళ్లారు. వైద్య నిపుణులు గేదెకు సిజేరిరిన్ చేసి దూడను బయటకు తీశారు. కాగా అప్పటికే దూడ కడుపులోనే మృతి చెందింది. ప్రస్తుతం గేదె ఆరోగ్యంగా ఉంది. కార్యక్రమంలో వైద్యులు సునీత, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు శివ, ప్రవీణ్, నరేష్, దామోదర్, రామాంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

బంజారాల బతుకమ్మ.. తీజ్

- గిరిజనులకు ఎంతో ప్రీతిపాత్రం
- రేపటి నుంచి రూపానాయక్ తండాలో ప్రారంభం
- ప్రకృతితో మమేకమయ్యే పండుగగా గుర్తింపు
- 11 రోజులు పాటు జరగనున్న వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల గిరిజన యువతులు (ఫైల్)


రూపానాయక్ తండాలో విశేష అలంకరణలో గురునానక్ మహరాజ్ మూలవిరాట్

ఉరవకొండ: తెలంగాణలో బతుకమ్మ పండుగ తరహాలో మన రాష్ట్రంలో కూడా గిరిజన వాసులకు హర్యాలీ తీజ్ పండుగ ప్రసిద్ధి. తీజ్ అంటే బ్రహ్మోత్సవాలు అని అర్థం అని గిరిజన పెద్దలు చెబుతారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక గిరిజన గ్రామాల్లో నిర్వహించే ఈ వేడుక రాను రాను ఆదరణ కరువై కొన్ని గ్రామాల్లోనే జరుపుకుంటున్నారు. ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో హర్యాలీ తీజ్ వేడుకలు 11 రోజుల పాటు అత్యంత వేడుకగా నిర్వహించుకుంటారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు గిరిజన తెగలకు చెందిన తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుతో పాటు ప్రముఖులు హాజరుకానున్నారు.

తీజ్ ఎంతో ప్రత్యేకం

బంజరాలు హర్యాలీ తీజ్ పండుగను తెలంగాణలోని బతుకమ్మ తరహాలో జరుపుకుంటారు. గ్రామానికి చెందిన యువతులు ప్రత్యేకంగా తయారు చేసిన వెదురు బుట్టల్లో సేంద్రియ ఎరువులు, పుట్టమన్ను, ఇసుకతో నింపుతారు. వీటిలో గోధమ గింజలను వేస్తారు. 11 రోజుల పాటు గురు నానక్ ఆలయం వద్ద ఉంచి ఉదయం, సాయంత్రం పూజలు చేస్తారు. గంపలో గోధమ గింజలు మొలకెత్తడానికి బావుల్లో నుంచి గంగజలాన్ని తీసుకొస్తారు. గింజలు మొలకెత్తిన తరువాత వివిధ రకాల పుష్పాలను తెచ్చి గుంప చుట్టూ అలంకరించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం వాటిని ఒక చోట తీజ్ ఆకారంలో ఉంచి గిరిజన యువతులు తమ సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యం చేస్తారు. ఇలా బుట్టలో మొలకెత్తిన గింజలకు పూజలు చేస్తే అమ్మాయిలకు మంచి మొగుడు దొరికి.. దాంపత్య జీవితం సుఖంగా ఉంటుందని ప్రగాఢ నమ్మకం. అనంతరం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆలయానికి గిరిజనులు చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించడం వారి ఆచారం.

ఏర్పాట్లు పూర్తి..

వజ్రకరూరు మండలం రూపానాయక్ తాండాలో తీజ్ ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం అవుతాయి. 16న గోధములు గంపలో వేయడంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 17 నుంచి 23 వరకూ గిరిజన యువతులు గ్రామాల్లో నృత్యాలు, భజనలు చేస్తారు. ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైనవి 24వ తేది ఢమోలి, 25న ఘనగోర్, శివపార్వతుల కల్యాణం, 26న తీజ్ మొక్కలు దేవి, దేవతులను భోగ్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలకు వస్తాను..



వజ్రకరూరులోని రూపానాయక్ తండాలో జరిగే హర్యాలీ తీజ్ ఉత్సవాలు నా చిన్నతనం నుంచి చూస్తున్నాను. ఎంతో సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారు. నాకు సంస్కృతి, సంప్రదాయలు ఆ గ్రామమే నేర్పించింది. సింధూ నాగరికతకు ప్రతిబింబం రూపానాయక్ తండా. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తప్పకుండా వస్తాను.

– మంగ్లీబాయి, ప్రముఖ గాయకురాలు

సంస్కృతికి నిదర్శనం



రూపానాయక్ తండా గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. హర్యాలీ తీజ్ వేడుకలు ఎలాంటి ఆధునిక హంగులు లేకుండా మన పూర్వ కాలం నుంచి ఎలా నిర్వహిస్తున్నామో అలా జరుపుకుంటాం. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా తరలివస్తారు. ఈ వేడుకల్లో ఆత్మవిశ్వాసంతో పాటు గిరిజనుల్లో సృజనాత్మకత శక్తి, విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది.

– ఎస్‌కె సుబ్రహ్మణ్యం నాయక్, రూపానాయక్ తండా

సమ్మెలోకి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు

ఉరవకొండ: ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ పథకం కింద పని చేస్తున్న 24 మంది కార్మికులు శనివారం విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కార్యాలయం వద్ద తాగునీరు సరఫరా చేసే కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీడబ్ల్యూఎస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లి, శీనా, రామాంజి తదితరులు మాట్లాడారు. 9 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించి పెండింగ్ జీతాలు చెల్లించే వరకూ విధుల్లో చేరబోమన్నారు. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఉరవకొండ పట్టణంతో పాటు 8 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన

రాయదుర్గంటౌన్: డిమాండ్ల పరిష్కారం కోరుతూ శ్రీరామిరెడ్డి వాటర్ స్కీమ్ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 10వ రోజుకు చేరుకుంది. శనివారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మికులు హెచ్చరించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు తీర్చాలని కోరుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు శనివారం పదో రోజూ సమ్మె కొనసాగించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు.